క్లుప్తంగా

రైతు రుణమాఫీ ప్రకటించాలి

నరసాపురం రూరల్: అధిక వర్షాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రైతాంగాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని, అందుకు గానూ రైతు రుణమాఫీ ప్రకటించాలని రైతు సంఘం నాయకుడు, మాజీ సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కూపపరెడ్డి రంగారావు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. అలాగే ఆక్వా రైతులకు ప్రభుత్వ పరంగా సబ్సిడీతో కూడిన విద్యుత్‌ను అందించాలని కోరారు. తాజాగా విద్యుత్ శాఖ నుంచి ఆక్వా చెరువుల యజమానులకు అదనపు డిపాజిట్‌ను చెల్లించాలంటూ నోటీసులు అందించారని అటువంటి ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు.

అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం

మొగల్తూరు: గత వారం రోజులుగా వర్షాల నేపథ్యంలో ప్రజలు అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ దినేష్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కారణంగా ఇంటి ఆవరణలో నీరు నిలువలేకుండా చూడాలని, కాచిచల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

పాఠశాలల్లో ఉత్సాహంగా శిక్షాసప్తాహ్

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఎడ్యుకేషన్ విధానం ప్రారంభించి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాలలో శిక్ష సప్తాహ కార్యక్రమం నిర్వహించినట్లు మండల విద్యాశాఖాధికారి గుమ్మళ్ల వీరాస్వామి అన్నారు. మంగళవారం స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో శిక్ష సప్తహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ద్వారా మెరుగైన అభ్యసన సామర్థ్యాలను సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శర్మ 2, హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయులు త్రిమూర్తులు, చంద్రకళ, శశికళ, భవానీదుర్గ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు పరామర్శ

పెనుగొండ: అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు వెలగల శ్రీనివాస రెడ్డి(బాబ్జీ)ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పరామర్శించారు. మంగళవారం పెనుగొండలో ని శ్రీనివాస రెడ్డి నివాసంలో పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు చెరుకువాడ నరేష్ రాజు, ఏడిద కోదండ చక్రపాణి, తిక్కిరెడ్డి పవన్‌కుమార్, గుడాల ఏసు, కుడుపూడి సుబ్రహ్మణ్యం, నందం కృష్ణారావు, మేడపాటి సురేష్ రెడ్డి, తాడి శ్రీనివాస రెడ్డి, ఎస్‌ఎస్‌ఎన్ రెడ్డి(బాబు)తదితరులు ఉన్నారు.

ముంపు పొలాల పరిశీలన

యలమంచిలి/పెనుగొండ: అధిక వర్షాల వలన నీట మునిగిన వరి పొలాలను మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం యలమంచిలిలంక వద్ద గోదావరిలో గల్లంతైన పితాని ఆనందరావు ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగేఆచంట వేమవరంలో నీటి ముంపుకు గురైన పంట పొలాలను బీజేపీ నాయకులు పరిశీలించారు.

అధ్యాపకుల భర్తీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణ రావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో భోదించడానికి అర్హులైన మహిళా అధ్యాపకుల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డా. శోభారాణి విలేకరులకు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. నెట్, స్లెట్ పాసైన వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 29 లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అలాగే ఈ నెల 30న ఉదయం 10 గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

ఘనంగా సినీ దర్శకుడు కోడి రామకృష్ణ జయంతి

పాలకొల్లు సెంట్రల్: ప్రముఖ సినీ దర్శకుడు కోడి రామకృష్ణ 75వ జయంతి కార్యక్రమం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక మారుతి థియేటర్‌లో పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో కోడి రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాపరిషత్ అధ్యక్షులు కేవీ కృష్ణ వర్మ కోడి రామకృష్ణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాపరిషత్ సభ్యులు మేడికొండ శ్రీనివాసరావు, మానాపురం సత్యనారాయణ, జక్కంపూడి కుమార్, కొల్లి కొండప్రసాద్, విశాకుల వెంకటరమణ, నీలంశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ నేత హర్షం

పాలకొల్లు అర్బన్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన బడ్జెట్‌పై బీజేపీ నేత, పాలకొల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్ధి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

వశిష్ట గోదావరి ఉగ్రరూపం

రోజురోజుకూ పెరుగుతున్న నీటిమట్టం

నరసాపురం: నరసాపురం వశిష్ట గోదావరి రోజు రోజుకూ పెరుగుతోంది. ఆది, సోమ వారాలతో పోలిస్తే మంగళవారం నీటిమట్టం మరింతగా పెరిగింది. వలంధర్‌రేవు పిండ ప్రధానం షెడ్డు ఫ్లోర్ మొత్తం నీటమునింది. ఇసుక ర్యాంపు ఏరియా నీట మునిగింది. లలితాంబ ఘాట్ వద్ద బాపూ విగ్రహం వరకూ వరదనీరు చేరింది. భద్రాచలం ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో సముద్రంలో వేగంగా నీరు కలుస్తుంది. అయితే సముద్ర పోటు సమయంలో నీటిమట్టం బాగా పెరుగుతోంది. పట్టణంలోని లాకుపేట, పొన్నపల్లి, మాధవాయిపాలె నరసాపురం మండలంలోని నవరసపురం, పాత నవరసపురం ప్రాంతాలకు ముంపుగండం పొంచి ఉంది. అలాగే పట్టణ పరిధిలో గోదావరి తీరాన్ని ఆనుకుని ఉన్న కాలనీలు పొన్నపల్లి, మాధవాయిపాలెం, లాకుపేట ప్రాంతాల వారు ఆందోళన చెందుతున్నారు. గోదావరి ఉధృతి కారణంగా పట్టణంలోని మధవాయిపాలెం గోదావరిరేవులో పంటు రాకపోకలు వరుసగా మూడో కూడా నిలిపివేశారు. ఇక చెక్క నావలపై గోదావరిలో వేట సాగించే సంప్రదాయ మత్స్యకారులు వరద కారణంగా ఖాళీ అయ్యారు. గోదావరి ప్రవాహ ఉధృతి కారణంగా వేట సాగకపోవడంతో నావలకు లంగరు వేశారు.


వశిష్ట గోదావరి వలంధర్‌రేవు వద్ద భారీగా పెరిగిన నీటిమట్టం

లోతట్టు ప్రాంతాల్లోకి చేరుతున్న వరదనీరు

నరసాపురం రూరల్: మండలంలో గోదావరి వరద ఉధృతి మంగళవారం సాయంత్రానికి పెరిగడం మొదలైంది. పాతనవరసపురం, కొత్తనవరసపురం ఎస్టీ కాలనీల్లోని పల్లపు ప్రాంతాలతోపాటు, నరసాపురం పట్టణంలోని ఒకటో వార్డు లాకుపేట ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి మంగళవారం సాయంత్రానికి వరదనీరు చేరుతుంది.ఆయా ప్రాంతాల్లో రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో నిత్యం గస్తీ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ప్రసాద్ నిరంతరం ఈ ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. పాత నవరసాపురం ఎస్టీ కాలనీలో వైద్య శిబిరాన్నికూడా ఏర్పాటు చేశారు. వరద ఉధృతి మరింత పెరిగితే తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి ఆయన సూచనలు చేశారు.

లంక గ్రామాల్లో ఆందోళన

పెనుగొండ: గోదావరి ఉధృతితో వరద నీరు ఆచంట మండలంలో లంక గ్రామాల్లోకి ప్రవేశిస్తుంది. అయోధ్యలంకలో లోతట్టు ప్రాంతంలోని పంచాయతీ, రామాలయం, ప్రాథమిక పాఠశాలల వద్దకు వరద నీరు ప్రవేశించింది. దీంతో సమీపంలోని నివాసాలకు వరద నీరు చేరుకుంది. కొన్ని ప్రాంతాల్లో వరద నీరు ప్రవేశించింది. దీంతో రహదారులపై వరదనీరు రెండు మూడు అడుగుల మేర ప్రవహిస్తుండడంతో రైతులు, గ్రామస్తులు మోకాలి లోతు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు.

సిద్ధాంతంలో

సిద్ధాంతంలో కేదారీఘాట్ వరద ముంపునకు గురైంది. పుష్కర రేవు పూర్తిగా నీట మునిగింది. సమీపంలోని కేదారేశ్వర స్వామి ఆలయంలోకి నీరు ప్రవేశిస్తే ప్రమాదంగా పరిసర ప్రాంత ప్రజలు భావిస్తుంటారు. మరో రెండురోజులు ఇదే స్థాయి ఉధృతి కొనసాగితే తప్ప ఎటువంటి ఇబ్బంది ఉండదని స్థానికులు భావిస్తున్నారు. పాడిరైతులు మధ్యస్థ లంకకు రాకపోకలు సాగిస్తున్నారు. బుధవారం పూర్తిగా నిషేధించే అవకాశం ఉంది. మంగళ వారం తహసీల్దారు రోహిణీ దేవి, ఎంపీడీవో శ్రీనివాస దొరలు పరిస్థితులు పర్యవేక్షించారు. నిలకడగా గోదావరి..వరద ముంపులోనే కనకాయలంక కాజ్‌వే

ముంపులోనే కనకాయలంక కాజ్‌వే

యలమంచిలి: గోదావరిలో వరద నీరు నిలకడగా ప్రవహిస్తోంది. కనకాయలంక వద్ద కాజ్‌వే మీద సుమారు నాలుగు అడుగుల వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో లంక గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ, పంచాయతీరాజ్, ఫిషరీస్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రజల రాకపోకలకు వీలుగా మూడు ఇంజన్ పడవలు ఏర్పాటు చేశారు. మనుషులకు, పశువులకు ఇబ్బంది కలగకుండా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేక అధికారి బి.రమణ, తహసీల్దార్ చిక్కాల విజయశ్రీ, ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, ఎస్సై కాకి శివనారాయణ సహాయక ఏర్పాట్లను పర్యవేక్షించారు.


సిద్ధాంతంలో పాడి పశువులు వద్దకు పడవలపై వెళుతున్న పాడి రైతులు


కొత్తనవరసపురం ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు


కనకాయలంక వద్ద కాజ్‌వే మీద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

గోదావరిలో గల్లంతైన ట్రాక్టర్ డ్రైవర్


నక్కల డ్రెయిన్‌లో పితాని ఆనందరావు కోసం గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

యలమంచిలి: యలమంచిలిలంక గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పితాని ఆనందరావు (43) సోమవారం గోదావరిలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. అతని కోసం మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలించినా అతని ఆచూకీ తెలియలేదు. ఆనందరావు కుటుంబంలో సోమవారం జరిగిన శుభకార్యంలో పాల్గొన్నాడు. అనంతరం గోదావరిలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. అతని భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటుంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

నరసాపురంలో నాలుగు ప్రాంతాల్లో ఆధార్ కేంద్రాలు


ఆధార్ నమోదు కేంద్రం వద్ద సూచనలు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసాపురం: ఆధార్‌కార్డుల్లో తప్పులు సరిచేయడం, కొత్త ఆధార్‌కార్డులు నమోదు, పిల్లల ఆధార్‌కార్డుల నమోదు కొరకు పట్టణంలో నాలుగుచోట్ల ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. మంగళవారం ఆధార్ నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించి ఉద్యోగులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 6 గంటలు వరకూ కేంద్రాలు కచ్చితంగా పనిచేయాలన్నారు. ఈ నెల 27 వరకూ ఉన్న ఈ అవకాశాన్ని పట్టణ వాసులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. 1వ వార్డు శ్రీహరిపేట వార్డు సచివాలయం, కోట వద్ద పాలెం వార్డు సచివాలయం, గాంధీనగర్, వీవర్స్ కాలనీ వార్డు సచివాలయాల్లో నాలుగుచోట్ల సేవలు అందుతాయని చెప్పారు.

క్లోరినేషన్ మీటర్ల ప్రారంభం

పెనుగొండ: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పెనుగొండలో క్లోరినేషన్ నీరు అందిస్తున్నట్లు సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి తెలిపారు. మంగళవారం పంచాయతీ వద్ద లిక్విడ్ క్లోరినేషన్ మీటర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో మండా ప్రసాద్, సిద్ధిరెడ్డి స్వాతి హైమ, బాలం కనకదుర్గ, నీలిమారాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ శాంతి థాంలో ఒడిశాకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి సుమారు 80 భక్తులు 102 అడుగుల పంచలోహ విగ్రహాన్ని దర్శించుకుని, మరకత శిల వాసవీ మాతకు ఆలయ అర్చకులు శిష్టామణికంఠ అర్చకత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దంపతుల పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

గుర్తింపు కార్డుల అందజేత

పోడూరు: ప్రభుత్వం, దాతలు కల్పించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రంశెట్టి పద్మారావు కోసం వేడంగి మెయిన్ పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత బొలిశెట్టి మంగయ్యనాయుడు ఆర్థిక సహాయంతో మంగళవారం విద్యార్థులకు గుర్తింపు కార్డులను అందించారు. టీడీపీ నాయకుడు కొండేటి ప్రసాద్, ఉప సర్పంచ్ వీరగొమ్ముల వెంకట కృష్ణ, హెచ్‌ఎం గెద్దాడ పెద్దిరాజు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన


కోడేరులో అధికారులకు ఆదేశాలు ఇస్తున్న కలెక్టరు నాగరాణి


వద్దిపర్రులో ట్రాక్టర్‌పై వరద ముంపును పరిశీలిస్తున్న అచ్యుత అంబరీష్

పెనుగొండ: గోదావరి ఉధృతి పెరిగే అవకాశం ఉండడంతో అధికారులు ముందస్తు ఏర్పాటు చేయాలని, ఏమాత్రం లోటు కనిపించినా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. మంగళవారం ఆచంట మండలంలో వశిష్ట గోదావరి పరివాహక ప్రాంతాలను పరిశీలించి, కోడేరు రేవు వద్ద అధికారులతో సమీక్ష నిర్వహించారు. లంకగ్రామాల ప్రజలకు భోజన, వసతులు, త్రాగు నీరు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పశువులు నష్టం జరగకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఏటిగట్టు బలహీనంగా ఉన్న చోట ఇసుక బస్తాలు, సర్వే బాదులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వరదల అనంతరం అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలని, మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. నెలలు నిండిన గర్భిణులను గుర్తించి ఆసుపత్రికి తరలించాలన్నారు. ఎక్కడికక్కడ వైద్య శిబిరాలు ఏర్పాటుతో పాటు, పాము, కుక్క కాటుకు మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి బి.పిచ్చయ్య, తహసీల్దారు ఐపీ శెట్టి, ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

వద్దిపర్రులో ఆర్డీఓ పర్యటన

పోడూరు: వరదముంపునకు గురైన వద్దిపర్రు గ్రామంలో మంగళవారం నరసాపురం ఆర్డీఓ అచ్యుత అంబరీష్ పర్యటించారు. వరద ప్రవాహంతో నక్కల మేజర్ డ్రెయిన్ పొంగడంతో వద్దిపర్రు గ్రామం వరద తాకిడికి గురైంది. వరద ముంపుతో గ్రామంలో పంట చేలన్నీ నీటమునిగాయి. ఆర్అండ్‌బీ రహదారిపై కూడా వరదనీరు ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో ఆర్డీఓ గ్రామంలో పర్యటించి స్థానిక అధికారులను, ప్రభుత్వ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆర్అండ్‌బీ రోడ్డు పై కొంతమేర వరదనీరు ప్రవహిస్తుండడంతో ఆయన ట్రాక్టర్‌పై ప్రయాణించి గ్రామంలో వరద ఉధృతిని పరిశీలించారు. రానున్న రెండు, మూడు రోజుల్లో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉండడంతో ఆర్డీఓ ఆదేశాల మేరకు గర్భిణులను, బాలింతలను, దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్థానిక తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్ఐ కె.రాంబాబు, సర్పంచ్ వద్దపాటి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు విప్పర్తి శారద, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ వెంకటరమణారావుకు ఘన నివాళి


వెంకటరమణారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: విధి నిర్వహణలో అందరి మన్ననలు పొంది ఇటీవల మృతి చెందిన ఎంపీడీఓ మండవ వెంకటరమణారావు ఆదర్శనీయుడని ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరభద్రరావు, పంచాయతీ ఏఈ నాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఆంజనేయశర్మ తదితరులు అన్నారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ చిత్రపటం వద్ద మండల అధికారులు, కార్యాలయ సిబ్బంది సంతాపం ప్రకటించి మౌనం పాటించారు. కార్యక్రమంలో యర్రంశెట్టి సత్యనారాయణ, పుల్లాజీ, మోటుపల్లి శివకళ్యాణి, వాసు, సురేష్, శ్రీరామ్ పాల్గొన్నారు.

కుష్టు నివారణకు సమగ్ర సర్వే

మొగల్తూరు: కుష్టువ్యాధి నివారణకు చేపట్టిన సర్వే మండలంలోని అన్ని గ్రామాల్లో జరగుతుందని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దినేష్, డాక్టర్ లక్ష్మీ పార్వతి మంగళవారం విలేకరులకు తెలిపారు. మైక్రో బ్యాక్టీరియా లెప్రి అనే సూక్ష్మ క్రిమి ద్వారా లెప్రసీ వ్యాధి వ్యాప్తిస్తుందన్నారు. రాగి, గోధుమ రంగులో ఉండి, తిమ్మిరి, లేదా స్పర్శ లేకపోవడం, చెమట పట్టకపోవడం, తిమ్మిరి వచ్చినా తెలియకపోవడం తదితర లక్షణాలుంటాయన్నారు. ప్రతి గ్రామంలోను ఆశ, ఏఎన్‌ఎం, హెల్త్ అసిస్టెంట్‌లు ఇంటింటి సర్వే చేసి అనుమానితులను గుర్తించి ఆసుపత్రికి రిఫర్ చేస్తారన్నారు. తాము రోగ నిర్ధారణ చేసి మందులు అందించడం జరగుతుందని లేని పక్షంలో చర్మవ్యాధుల నిపుణలకు సిఫార్సు చేస్తామని వారు తెలిపారు.


అబ్రహంపేట ప్రాంతంలో బాలుడుని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

వరదనీటిలో రామలింగేశ్వరస్వామి ఆలయం


నత్తారామేశ్వరంలో వరదనీటిలో శ్రీనత్తారామలింగేశ్వరస్వామి ఆలయం


నత్తారామేశ్వరంలో వరదనీటిలో పూజలు అందుకుంటున్న రామలింగేశ్వరస్వామి

పెనుమంత్ర: నత్తారామేశ్వరం గ్రామంలోని శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయం గోస్తనీ జలదిగ్బంధంలో ఉంది. నిన్నటి వరకు ఆలయ మండపంలోకి ప్రవేశించిన వరదనీరు మంగళవారం నుంచి గోపురం మెట్లను కూడా తాకుతుంది. గోస్తనీ గర్భంలో ఉన్న పరశురామ ప్రతిష్ఠ రామలింగేశ్వర ఆలయం పూర్తిగా శిఖరం వరకు వరద నీటిలో మునిగి ఉండగా సీతారామ ప్రతిష్ఠ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో కూడా మోకాలు లోతు నీరు ప్రవహించింది. దీంతో శ్రీరామలింగేశ్వరునికి ఉమాదేవికి నీటిలోనే నిత్యపూజలు నిర్వహిస్తున్నారు. నీటిలోకి దిగి వెళ్లి కొందరు భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుంటున్నారు. గోస్తనీలో రోజురోజుకూ వరద ఉధృతి పెరగడంతో వారం రోజులు వరకు ఈ ప్రాంతంలో వరదముంపు తగ్గే పరిస్థితి కానరావడంలేదు.

నారుమడుల ముంపుతో రైతన్నల ఆవేదన

పెనుమంత్ర: మండలంలో గోస్తనీ డ్రెయిన్‌లో వరదనీటి ప్రవాహం మరింత పెరగడంతో గోస్తనీ పరివాహక ప్రాంతంలోని ఎస్ ఇల్లిందలపర్రు, మల్లిపూడి, నత్తారామేశ్వరం, జుత్తిగ, వెలగలవారిపాలెం, పెనుమంత్ర, మాముడూరు గ్రామాలకు చెందిన సుమారు 6,700 ఎకరాలు పంటభూమి జలదిగ్బంధంలో ఉంది. సుమారు 3400 మంది చిన్న సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈనెల 12 నుంచి కురుస్తున్న వర్షాలకు తగ్గుముఖం పట్టినప్పటికీ గోస్తనీలో గోదావరి నుంచి వస్తున్న వరదనీరు అధికం కావడంతో ఈప్రాంతాల్లోని పంట పొలాలు అన్ని ముంపుబారిన పడుతున్నాయి. దీనిపై పది రోజులుగా ముంపుబారిలో ఉన్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎకరాకు సుమారు 12 వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి నాట్లు వేసిన రైతులు, మరలా నాట్లు వేసే పరిస్థితి వస్తుండటంతో నష్టాలను భరించలేక నానా అవస్థలు పడుతున్నారు. రైతు చేతికి దాళ్వా అమ్మిన సొమ్ము చేతికి రాకపోవడంతో పెట్టు బడులు పెట్టలేని పరిస్థితిలో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో రూ. 25 కోట్ల వరకు రైతులకు ఇంకా ధాన్యం సొమ్ము ప్రభుత్వం నుంచి అందాల్సి ఉంది. దీనిపై అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


వెలగలవారిపాలెం - పెనుమంత్ర సరిహద్దులో ముంపులో ఉన్న చినపైడవ పంటభూమి


మొగల్తూరు పంచాయతీ ఇంజేటివారిపాలెంలో నీటమునిగిన ఆకుమళ్ళు, చేలు

నీటమునిగిన నారుమడులు

మొగల్తూరు: మొగల్తూరు మండలంలో ఇటీ వల కురిసిన వర్షాలకు ఆకుమడులతో పాటు నాట్లువేసిన చేలు ముంపునకు గురయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో మొగల్తూరు మండలంలో గత ఆరు రోజులగా సుమారు 105.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో రామన్నపాలెం పంచాయతీ అడవిపర్ర, సుబ్బారాయుడు గుడి ప్రాంతాల్లోనూ, మొగల్తూరు పంచాయతీలోని ఇంజేటివారిపాలెం, నక్కావారిపాలెం, పాలకమ్మచెరువు ప్రాంతాలలో ఆకుమడులు, ముందుగా నాట్లు వేసిన చేలు ముంపునకు గురయ్యాయి. రామన్నపాలెం పంచాయతీలో ప్రధాన రహదారి సమీపంలోని ఆకుమడుల్లోచేరిన నీటిని ఇంజిన్లు వేసి బయటకు తోడి, వ్యవసాయాధికారులు సూచించినట్లుగా ఆకు పాడవకుండా సస్య రక్షణ చర్యలు చేపట్టారు. గత వారం రోజులగా కురుస్తున్న వర్షాలకు 64 ఎకరాల్లో వరి నాట్లు వేయగా 49 ఎకరాలు ఇంకా ముంపులోనే ఉన్నాయని, అలాగే 30 ఎకరాల్లో నారుమళ్లు వేయగా 15 ఎకరాల్లో నారుమడులు దెబ్బతిననట్లు వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ తెలిపారు.